
డిటెక్టివ్ స్టోరీ

# నా చావుకి కారణం..!?

యం. ఉదయభాను



ఆకాశం కాటుక పులిమినట్లు నల్లగా ఉంది. చుట్టూ కారు చీకటి. ఆ కారుచీకట్లో దారీ తెన్నూ చూసుకోకుండా ప్రాణ భయంతో పరుగులు తీస్తోందో స్త్రీ.

ఆకాశంలో ఉండి ఉండి అప్పుడప్పుడూ తళతళ మంటూ మెరుపు మెరుస్తోంది. ఆ మెరుపు వెలుగులో చురుక్కు మని మెరుస్తోంది ఓ చురకత్తి.

ఆ చురకత్తి చేత బూనిన ఓ అగంతుకుడు ఆ స్త్రీని పట్టుకోవడానికి పరుగులు తీస్తున్నాడు.


ఆమె అబల. అయినా శక్తి కొద్దీ ఆ అగంతకుడికి దొరకకూడదనే పరుగులు తీస్తోంది. అప్పుడే ఒక్కసారి పెళిల్లుమని ఉరుము ఉరిమింది. దాంతో బాటు జోరున వర్షం మొదలయింది. ఆమె అడుగులు తడబడుతున్నాయి. కొద్ది దూరంలో ఓ బంగళా కనిపించింది. అక్కడికి చేరుకుంటే చాలు ఎలాగైనా ప్రాణాలు కాపాడుకోవచ్చు అని ఆమె నమ్మకం.

అందుదుకే లేని శక్తిని కూడదీసుకొని మళ్లీ పరుగందుకుంది ఆమె. మెరుపు వెలుగులో ఆమె ఆకారం కనపించడంతో అగంతకుడు ఆమె వైపు రాసాగాడు.

ఆమె మరింత వేగంగా పరిగెత్తబోయి కాళ్లు తడబడి బురదలో కుప్పకూలింది. అయినా తనకైన గాయాలను కూడా లెక్కచేయకుండా, కనపబడే బంగళా వైపు పరుగు తీస్తూ, తన శక్తినంతా కూడదీసుకొని, ''రక్షించండీ....'' అంటూ గావు కేక వేసింది.

ఆ కేక వినబడడంతో బంగళాలో లైట్లు వెలిగాయి. ఆ లైట్లు వెలగడంతో ఆమెలో ప్రాణం మీద అడుగంటిన ఆశ ఒక్కసారి చిగురించింది. అదే ఊపుతో ముందుకురికి గేటుకున్న కాలింగ్ బెల్ నొక్కింది.

ఆమె గేటు దగ్గరకి చేరడంతో అంతవరకూ ఆమెను వెన్నాడుతున్న అగంతకుడు తక్కున షాక్ గొట్టినట్టు ఆగిపోయాడు. గేటు మీద 'సత్యానిలయం' అని రాసి ఉంది. పళ్లు పటపటనూరుతూ వెనుతిరిగాడు అగంతకుడు. బంగళా తలుపులు తెరుచుకున్నాయి.....



***

తెల్లవారు జామున 'సత్యానిలయం' ముందు పోలీస్ జీపు ఆగి ఉంది. ఎస్ఐ మార్తాండ్ తన బృందంతో జీపు దిగాడు. ఎస్ఐని చూడగానే బంగళా ఓనర్ సత్యమూర్తి పోలీసులకు ఎదురేగాడు. ''రండి ఎస్ఐగారు నేనే మీకు ఫోన్ చేద్దాం అనుకున్నా, కానీ మీరే వచ్చేశారు....'' అంటూ పోలీసుల్ని ఆహ్వానించాడు సత్యమూర్తి.

సత్యమూర్తికి నగరంలో సంఘ సేవకుడిగా మంచి పేరుంది. ప్రజల బలం ఉంది.

సత్యమూర్తి మాటలు పూర్తి కాకుండానే అడ్డు పడ్డాడు మార్తాండ్. ''ఫోన్ చేద్దాం అనుకున్నారే గానీ, చేయలేదుగా....ఇప్పుడు మేం వచ్చేసాం కనుక ఈ మాటలంటున్నారు. యామై రైట్...'' అంటూ గబగబా హాల్లోకి చేరుకున్నాడు.

హాలు మధ్యలో ఓ స్త్రీ శవం నిర్జీవంగా పడి ఉంది.


ఆ స్త్రీ శరీరం మీద గాయాలున్నాయి. దుస్తులన్నీ బురదకొట్టుకొని ఉన్నాయి. ఆమె వయసు పాతిక, ముప్పై సంవత్సరాల మధ్య ఉండొచ్చు.

శవాన్ని చూడగానే కూలీనాలీ చేసుకొని బ్రతికే పేదరాలిగా కనిపిస్తోంది. శవాన్ని పరిశీలిస్తూ, ''ఇంత దారుణానికి ఒడిగట్టడానికి మీ మనసెలా ఒప్పింది..?'' సత్యమూర్తిని సూటిగా ప్రశ్నించాడు ఎస్ఐ మార్తాండ్.

''మీరేం మాట్లాడుతున్నారు?'' అయోమయంగా అడిగాడు సత్యమూర్తి.

''ఇంకా వివరంగా చెప్పాలా....మీ పశు వాంఛకు ఓ అమాయకురాల్ని బలితీసుకొన్నారు. యూ ఆర్ అండర్ అరెస్ట్. మీరేమైనా చెప్పుకోవాలంటే కోర్టులో చెప్పుకోవచ్చు...'' అంటూ సత్యమూర్తిని అరెస్ట్ చేశాడు ఎస్ఐ.

ఆ స్త్రీ శవాన్ని వివిధ భంగిమల్లో ఫోటోలు తీసి నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు పంపించాడు. అలాగే శవాన్నిపోస్టుమార్టమ్‌కు గాను సిటీ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు.



***

మరునాడు ఆ వార్త తెలిసి ఊరు ఊరంతా గుప్పుమంది. సంఘ సేవకుడిగా పేరున్న సత్యమూర్తిని అందరూ ఈసడించుకున్నారు. నిజానికి పోస్టుమార్టమ్ రిపోర్ట్ వచ్చే వరకూ కూడా ఎస్ఐ మార్తాండ్ ఈ హత్య సత్యమూర్తి చేసి ఉండడనే భావించాడు. తను విద్యార్థిగా ఉన్నప్పుడు కాలేజీ ఫీజులు కట్టడానికి ఆయన ఎంతో సహాయం చేశాడు. తన పరిశోధన ద్వారా ఎలాగైనా అసలైన హంతకుడ్ని చట్టానికి పట్టించాలనుకున్నాడు. సత్యమూర్తిని విడిపించాలనుకొన్నాడు.

కానీ, పోస్ట్‌మార్టమ్ రిపోర్టులో వెలువడిన విషయాలు తెలియగానే ఈ దారుణానికి ఒడిగట్టింది సత్యమూర్తేనని రూఢి అయింది.

చనిపోయిన స్త్రీ పేరు సరోజ. పోస్టుమార్టంలో ఆమె కడుపులో ఓ ప్లాస్టిక్ కవర్ చుట్టిన ఓ తెల్ల కాగితం దొరికింది. దాని మీద, ''నా చావుకు కారణం సత్యమూర్తి. అతనే హంతకుడు, సరోజ'' అనిరాసి ఉంది.

ఈ ఒక్క చీటీ దొరకడంతో సత్యమూర్తే నేరస్థుడని రుజువయిపోయింది.

ఆ రోజు సాయంత్రమే అన్ని పేపర్లలో, టీవీలల్లో 'సంఘ సేవకుడి నిజరూపం' అంటూ ప్రత్యేక కథనాలు ప్రచురించారు.

***

''మీరు నమ్మినా నమ్మకపోయినా జరిగింది చెబుతాను. ఆ హత్య జరిగిన రాత్రి నేను బాల్కనీలో పచార్లు చేస్తున్నాను. ఇంతలో ఉన్నట్టుండి ఆకాశంలో ఉరుములు, మెరుపులు మెరిసాయి. ఆ మెరుపు వెలుగులో దూరం నుండి ఎవరో స్త్రీ మా బంగళా వైపు పరుగెత్తుకు రావడం కనిపించింది. కాసేపట్లో వర్షం మొదలయింది. అప్పుడే 'రక్షించండి..' అన్న కేక వినిపించింది. నేను వెంటనే కిందకు దిగి వచ్చాను. అప్పటికే మా గేటు ముందు సరోజ పడిపోయి ఉంది. వెంటనే హాల్లోకి చేర్చి, మంచినీళ్లందించాను....'' అని చెబుతున్న సత్యమూర్తి మాటలకు అడ్డుపడుతూ,

''మంచినీళ్లు మాత్రమే ఇచ్చారా.....లేక ఇంకేమైనా ఇచ్చారా? అంటే కాఫీ, టీ లాంటివి..'' అంటూ అడిగాడు ఎస్ఐ మార్తాండ్.

''ఎందుకలా అడుగుతున్నారు...?'' అనుమానంగా అడిగాడు సత్యమూర్తి.

''ఎందుకంటే హతురాలికి విషప్రయోగం జరిగింది...''

''నిజమా...?'' నమ్మలేనట్లు చూశాడు సత్యమూర్తి.

''ఇంతకూ మీకు ఆ అమ్మాయి తెలుసా....?''

''ఆ సరోజ ఎవరో నాకు గుర్తులేదు గాని ఒకటి రెండు సార్లు మాత్రం తన భర్తకు వైద్యం చేయించాలని డబ్బు అవసరమని అడిగితే డబ్బు సాయం చేసినట్లు గుర్తు.....'' గుర్తు చేసుకుంటూ చెప్పాడు సత్యమూర్తి.

''ఈమె భర్త ఎక్కడున్నాడు?''

''ఏదో హాస్పిటల్లో...ఇరుగు పొరుగు వార్ని వాకబు చేస్తే తెలుస్తుంది....''

''ఈ హత్యకు మీకూ ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు కానీ ఇది చూడండి....'' అంటూ పోస్టుమార్టంలో దొరికిన కాగితాన్ని



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## ఎవరికి ఎవరు కాపలా?

"ఈ దానకర్ణుని మరణం మనకు తీరని లోటు" అంటూ శ్లాఘించాయి పత్రికలు. అవును మరి! సమాజసేవకు, మానవ కల్యాణానికే జీవితం అంకితం చేసిన మహాదాత కన్నుమూశాడు. కోట్లకు పడగలెత్తిన కుటుంబంలో పుట్టినా, నిరుపేదగా బతికి సంపదనంతా దరిద్ర నారాయణుల సేవకే వెచ్చించాడు. వాళ్ల వంశానికో ప్రత్యేకత వుంది. వాళ్ల ముత్తాతకు వాళ్ల తాత, ఆయనకు ఈయన తండ్రీ, ఆ తండ్రికి ఈయన ఒక్కరే సంతానం.

పార్థివ దేహాన్ని చివరిసారిగా దర్శించటానికి జనం తండోపతండాలుగా వచ్చారు. హాల్లో టేబుళ్ల మీద, ఆ దివంగత మహానుభావుని వల్ల సహాయం పొందిన వివిధ సంస్థలు, దేశాధినేతలు కృతజ్ఞతా పూర్వకంగా యిచ్చిన జ్ఞాపికలు, బహుమతులు వరుసగా అమర్చారు. ఆ ఖరీదైన వస్తువుల రక్షణ కోసం మఫ్టీలో పోలీసు డిటెక్టివ్‌లు కూడా వున్నారు.

ఎడతెగని అభిమానుల తాకిడితో హాలు కిటకిటలాడింది. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఒక మధ్య వయస్కురాలు శవపేటికను చివరిసారి ముద్దాడి, తలవంచుకుని కాసేపక్కడే నిలబడింది. ఓ యువకుడు, ఆమె పక్కనే నిలబడి, వారిస్తున్న పోలీసులతో "ప్లీజ్, ఆమెను డిస్టర్బ్ చేయకండి. ఆ మహాదాత గారి మేనకోడలు. చివరి చూపు కోసం వచ్చింది" అంటూ సర్ది చెప్పాడు.

"జాగ్రత్త. ఎవరో కిలాడీ లాగుంది. మెమెంటోలు దొంగిలించటానికి వచ్చింది." అంటూ తన అసిస్టెంట్లను హెచ్చరించాడు డిటెక్టివ్.

డిటెక్టివ్ కెందుకా సందేహం వచ్చింది?

**సమాధానం:** మృతుడి తాతకు, అతడి తండ్రి ఏకైక సంతానం. అతడూ అతడి తండ్రికి ఒక్కడే సంతానం. మరి, ఆయనకు మేనకోడలెలా వుంటుంది?

చూపించాడు.

ఆ కాగితాన్ని చూస్తూనే సత్యమూర్తి మొహం వెలవెలబోయింది. నోట మాటరాలేదు.

"దొరికే వరకూ అందరూ దొరలే....సమాజసేవకుడి ముసుగులో నువ్వాడుతున్న నాటకానికి తెర పడింది....." కటువుగా పలికాడు ఎస్ఐ మార్తాండ్.

***

పాత బస్తీలో ఉన్న సరోజ ఇంటికెళ్లి సరోజ భర్త గురించి వాకబు చేశాడు ఎస్ఐ. ఆమె భర్త పేరు రాజయ్య. అతను అనారోగ్యంతో గవర్నమెంటు హాస్పిటల్లో ఉన్నాడని తెలిసింది. హాస్పిటల్లో ఉన్న రాజయ్యను కలుసుకోవడం పెద్ద కష్టం కాలేదు పోలీసులకు.

సరోజ హత్య గురించి తెలియగానే ఘొల్లుమన్నాడు రాజయ్య. "నా కోసమే ప్రాణం మీదకు తెచ్చుకుందయ్యా... నా భార్యను నేనే చంపుకున్నాను...." అంటూ వాపోయాడు.

"ఎందుకలా అనుకుంటున్నావు...?" అడిగాడు మార్తాండ్.

"హఠాత్తుగా నాకు జబ్బు చేయడంతో నా భార్యే రెక్కలు ముక్కలు చేసుకొని సంసారాన్ని లాక్కొస్తోంది. ఎంత డబ్బూ మందులకే సరిపోవట్లేదు. ఎవరైనా దాతలు దానం చేయకపోతారా అని కనిపించిన వారందరినీ అర్థిస్తుండేది. నాలుగు రోజుల క్రితం మన కష్టాలు గట్టెక్కినట్టేనని సంతోషంగా చెప్పింది...." అని ఓ నిమిషంసేపు ఆగాడు రాజయ్య.

రాజయ్య చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు ఎస్ఐ మార్తాండ్. గ్లాసులో నీళ్లు తాగి మళ్లీ చెప్పడం ప్రారంభించాడు రాజయ్య.

"ఎలక్షన్లలో నిలబడుతున్న రాయుడు మనల్ని ఆదుకుంటానన్నాడని తెలిపింది. నేను కూడా సరే వెళ్లమన్నాను. ఆ రోజు సాయంత్రం రాయుడు ఇంటికి వెళతానంది. ఇదో మూడురోజులయింది. సరోజ కోసం ఎదురు చూస్తున్నా...." అని చెప్పి దుఃఖించసాగాడు రాజయ్య.

***

పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎస్ఐ మార్తాండ్ సరోజ హత్య ఫైల్ ముందుంచుకొని సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. సరోజను తాను హత్య చేయలేందటున్నాడు సత్యమూర్తి. పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో దొరికిన కాగితంలో 'సత్యమూర్తే హంతకుడు' అన్న బలమైన సాక్ష్యం ఉంది.

రాజయ్య సరోజ ఆరోజు రాయుడు ఇంటికి వెళ్లిందన్నాడు. సత్యమూర్తి హంతకుడు కానట్టయితే ఆ కాగితం సంగతేంటి?

ఓసారి రాయుడిని కూడా విచారిస్తే బాగుంటుందనుకొని రాయుడి ఇంటికి చేరుకున్నాడు మార్తాండ్. ఇంటి ముందంతా అతని అనుచర గణం ఉన్నారు. గబగబా లోపలికి వెళ్లిన మార్తాండ్‌కు పక్క గదిలో రాయుడు ఎవరితోనో మాట్లాడుతున్న మాటలు అతన్ని ఆకర్షించాయి. జాగ్రత్తగా ఆ సంభాషణ విన్నాడు.

ఈలోగా ఎస్ఐ వచ్చాడన్న విషయం తెలిసిన రాయుడు హడావిడిగా ఎస్ఐకి ఎదురొచ్చి ఆహ్వానించాడు.

ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా సరోజ ఫోటో చూపించి, "ఈ అమ్మాయి మీకు తెలుసా?" అడిగాడు. తెలీదన్నట్లు అడ్డంగా తలూపాడు.

"ఎంతో మంది వచ్చి కలుస్తుంటారు. మాకెలా గుర్తుంటుంది..." అన్నాడు రాయుడు గంభీరంగా.

మళ్లీ మరోసారి ఆ ఫోటోను దీక్షగా చూస్తూ, "ఈ అమ్మాయి హత్య జరిగిందిగా. హంతకుడు సత్యమూర్తి అని పేపర్లో వేసారు చూసాను..." అన్నాడు ముక్తసరిగా.

"ఆ విషయమే ఇంకా తేలలేదు. హత్య జరిగిన రాత్రి సరోజ మీ దగ్గరకొచ్చిందని ఆమె భర్త రాజయ్య చెబుతున్నాడు...."

"చెప్పానుగా రాజకీయ నాయకుణ్ణి. ఎందరో వస్తుంటారు....పోతుంటారు...అందరినీ ఎలా గుర్తించగలను? నాకు వేరే మీటింగ్ ఉంది వెళ్లాలి" అంటూ లేచాడు రాయుడు.

"మళ్లీ అవసరమైతే కలుస్తా...." అంటూ బయలుదేరాడు ఎస్ఐ మార్తాండ్. జీపు నడుపుతున్నాడే గాని, అతని మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు. ఒక్కసారి మెరుపు మెరిసినట్లయింది. జీపును రాజయ్య ఉన్న హాస్పిటల్‌కు మళ్లించాడు.

పోస్ట్‌మార్టంలో దొరికిన కాగితాన్ని రాజయ్యకు చూపించి, ఆ దస్తూరి సరోజదేనా? కాదా? చెప్పమన్నాడు. ఆ కాగితాన్ని చూసి రాజయ్య చెప్పిన మాటలు వింటూనే అలర్ట్ అయ్యాడు ఎస్ఐ మార్తాండ్.

***

ఇక రాబోయే ఎలక్షన్‌లో తనకు తిరుగులేదని ధీమాగా ఉన్నాడు రాయుడు. ప్రెస్ కాన్ఫరెన్స్ తన ఇంట్లో ఏర్పాటు చేసాడు.

"నాకు పోటీగా ఉన్న సత్యమూర్తి ఓ స్త్రీ జీవితాన్ని కాటేసి కటకటాలపాలయ్యాడు. ఇంక నాకు తిరుగు లేదు. గెలుపు నాదే...." అని ప్రకటించాడు.

అప్పుడే అక్కడకు చేరుకున్నాడు ఎస్ఐ మార్తాండ్.

"నీ పథకం పారి ఉంటే విజయం నీదే అయి ఉండేది. కానీ నీ బండారం బయటపడింది. సరోజకు సహాయం చేస్తానని ఇంటికి రప్పించుకొని ఆమెకు విషమిచ్చి ఓ చీటి మీద 'సత్యమూర్తి హంతకుడు' అని రాసి ప్లాస్టిక్ కవర్ పెట్టి బలవంతంగా మింగించావు. ఆమెను వెంటాడి సత్యమూర్తి ఇంటి ముందు పడిపోయేలా చేశావు.

ఇంత వరకూ బాగుంది. కానీ సరోజ నిరక్షరాస్యురాలని, ఆమెకు అక్షరం రాయడం రాదని నీకు తెలియదు మిస్టర్....రాయుడు...." అనే సరికి మీడియా వాళ్లంతా ఎస్ఐ చుట్టూ మూగారు.

రాయుడు పారిపోయేవాడే కానీ సరోజను వెంటాడిన అగంతకుడు పోలీసుల మధ్య ఉండడంతో గతుక్కుమన్నాడు. రాయుడిని అరెస్ట్ చేసి, సత్యమూర్తిని విడుదల చేశారు.

*